# హైదరాబాద్ వార్త



## విద్యా,గృహ రుణాలకు అధిక ప్రాధాన్యత

**-జిల్లా వార్షిక రుణ ప్రణాళిక ఖరారు : అదనపు కలెక్టర్ జితేందర్ రెడ్డి**




బ్యాంక్ అధికారులతో కలిసి మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ జితేందర్ రెడ్డి

**హైదరాబాద్, జూన్ 17,ప్రభాతవార్త:** జిల్లాలో విద్యా గృహ రుణాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అదనపు కలెక్టర్ జితేందర్ రెడ్డి బ్యాంక్ అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన డిసిసి, డిఎల్ఆర్సి సమావేశానికి ఎల్డీఎం నరసింహ మూర్తి తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా వార్షిక ఋణ ప్రణాళిక 2026-27ను అదనపు కలెక్టర్ జితేందర్ రెడ్డి సంబంధిత అధికారులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాబార్డ్ బ్యాంకు నిర్దేశించిన రుణ లక్ష్యాలకు అనుగుణంగా, లీడ్ బ్యాంకు ఆఫీస్ జిల్లాలోని బ్యాంకులకు వివిధ రంగాలకు కేటాయించిన వార్షిక రుణ లక్ష్యాలు రూ.4,81,936.64 కోట్లు . అందులో ప్రాధాన్యత రంగాలకు లక్ష్యాలు రూ.1,41,208.93 కోట్లు కేటాయించటం జరిగిందని అన్నారు. గత ఏడాది (2025-26) బ్యాంకులు అందించిన రుణాలపై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లాలోని బ్యాంకులు గత ఏడాది నిర్దేశించిన లక్ష్యాలను చేరుకున్నందుకు బ్యాంకులను ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో డీజీఎం ఆర్.బి.ఐ దేవ్ ప్రియ, ఏజీఎం ఆర్బిఐ హేమలత, నాబార్డ్ డీడీఎం హర్ష రఘురాం,ఎల్డీయం నరసింహ మూర్తి, వివిధ వాణిజ్య, సహకార , బ్యాంకుల కంట్రోలర్స్,ఇతర సీనియర్ జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## నగరంలో ఉన్నతస్థాయి బృందం విస్తృత పర్యటన

**-నీటి నిల్వ ప్రాంతాల గుర్తింపు**
**..ముందస్తు చర్యలకు ఆదేశాలు**



ఉప్పల్ చౌరస్తాలో నీటి నిల్వ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు సుదర్శన్‌రెడ్డి, డిజిపి సివి ఆనంద్, హైడ్రా కమిషనర్ రంగనాద్, ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి తదితరులు

**ఉప్పల్, జూన్ 17 ప్రభాతవార్త :** నగరంలోని పలు ప్రాంతాల్లో రాష్ట్ర ప్రభుత్వ ఉన్నత స్థాయి బృందం బుధవారం పలు ప్రాంతాల్లో పర్యటించింది. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ డీజీపి సీవి ఆనంద్, హైడ్రా కమిషనర్ రంగనాదజ్, మల్కాజిగిరి సీపీ. సుమతి, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి, జలమండలి ఎండి అశోక్ రెడ్డి, ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధికా గుప్తా, మల్కాజిగిరి జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్, ఎల్ బి నగర్ జోనల్ కమిషనర్ వికాస్ మహతో, ఎంఎంసి చీఫ్ ఇంజనీర్ అశోక్ రెడ్డి, జలమండలి ఈడి పంకజ తదితరులు నగరంలోని బేగంపేట చీకోటి గార్డెన్, ఉప్పల్ చౌరస్తా, ఎల్బినగర్, వనస్థలిపురం, తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వర్షాకాలంలో నగర ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలలో భాగంగా మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రధాన నీటి నిల్వ ప్రాంతాలను ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్ రెడ్డితోపాటు ఉన్నత స్థాయి అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రస్తుత పరిస్థితులు మరియు భవిష్యత్ కార్యాచరణను సమీక్షించారు. బేగంపేట చికోటి గార్డెన్స్ ప్రాంతం గతంలో ప్రధాన నీటి నిల్వ ప్రాంతంగా గుర్తించబడిందని తెలిపారు. ఈ ప్రాంతంలో రహదారి కిందుగా 2.0 మీటర్ల పరిమాణంలో స్టార్మ్ వాటర్ డ్రెయిన్ నాలా ప్రవహిస్తోందని తెలిపారు. అయితే విద్యుత్ కేబుళ్లు మరియు తాగునీటి పైపులు నాలాను అడ్డంగా దాటడం వల్ల వర్షపు నీటి ప్రవాహానికి అంతరాయం కలుగుతోందని తెలిపారు..ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా ప్రధాన రహదారి క్రింద అండర్‌గ్రౌండ్ టన్నెలింగ్ పనులు ప్రారంభించబడ్డాయని తెలిపారు. రహదారి క్రింద సుమారు సగం వరకు టన్నెలింగ్ పనులు పూర్తయిన అనంతరం జలమండలి తాగు నీటి పైప్‌లైన్ అడ్డుగా ఉండటం గుర్తించబడిందని తెలిపారు. పైప్‌లైన్ తరలింపు అనంతరం మిగిలిన పనులు చేపడుతామన్నారు. ప్రస్తుతం వర్షాకాలంలో నీటి నిల్వ సమస్య తలెత్తకుండా ఉండేందుకు ఇప్పటికే ఉన్న నాలాను నిరంతరం పూడికతీసి వర్షపు నీరు సాఫీగా ప్రవహించేలా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.

**ఉప్పల్‌లో..**

అదే విధంగా ఉప్పల్ జంక్షన్ గతంలో తీవ్ర నీటి నిల్వ ప్రాంతంగా ఉండేదని, 2 సెంటీమీటర్లకు మించిన వర్షపాతం నమోదైతే ఈ ప్రాంతంలో నీరు నిలిచి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగేదని తెలిపారు. 4 సెంటీమీటర్లకు మించిన వర్షపాతం సమయంలో రహదారిని తాత్కాలికంగా మూసివేయాల్సిన పరిస్థితులు ఏర్పడేవని తెలిపారు. ఈ సమస్య పరిష్కారానికి 5 లక్షల లీటర్ల సామర్థ్యంతో రైన్ వాటర్ హోల్డింగ్ స్ట్రక్చర్ నిర్మించడంతో పాటు 10 హెచ్‌పీ సామర్థ్యం గల రెండు డీవాటరింగ్ పంపులను ఏర్పాటు చేశారని తెలిపారు. వర్షాల సమయంలో అదనపు వర్షపు నీటిని హోల్డింగ్ స్ట్రక్చర్‌లో నిల్వ చేసి, వర్షం తగ్గిన అనంతరం 600 మి.మీ వ్యాసం గల పైప్‌లైన్ ద్వారా ఇప్పటికే ఉన్న డ్రెయిన్‌లోకి పంపింగ్ చేస్తున్నారని తెలిపారు. అదే విధంగా మహంకాళి ఆలయం సమీపంలోని నీటి నిల్వ ప్రాంతం నుండి సబ్‌స్టేషన్ పక్కన ఉన్న హోల్డింగ్ స్ట్రక్చర్ వరకు 900 మి.మీ వ్యాసం గల పైప్‌లైన్ ఏర్పాటు చేసి అదనపు వర్షపు నీటిని మళ్లించే విధంగా చర్యలు చేపట్టారని తెలిపారు. ప్రస్తుతం పై పనులు పూర్తైన అనంతరం ఈ ప్రాంతంలో నీటి నిల్వ సమస్య పూర్తిగా నివారించబడిందని తెలిపారు.

**ఎల్బినగర్ వద్ద ..**

రోడ్స్ ఎల్.బి. నగర్ ఫ్లైఓవర్‌కు ఆనుకుని ఉన్న సర్వీస్ రోడ్డులోని సితార గ్రాండ్ సమీప ప్రాంతం వర్షాకాలంలో నీటి నిల్వకు గురయ్యేదని,.ఈ ప్రాంతానికి పెద్ద మొత్తంలో వర్షపు నీరు చేరుతుండగా, ఇప్పటికే ఉన్న ఆర్‌సీసీ పైప్‌లైన్ సామర్థ్యం సరిపోకపోవడంతో క్యాచ్‌పిట్ల నుండి నీరు పొంగి రహదారిపై నిలిచిపోయేదని తెలిపారు. .ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా రోడ్ నెం. 2, చంద్రపురి కాలనీ నుండి గుంటి జంగయ్య కాలనీ వరకు 900 మి.మీ వ్యాసం గల స్టార్మ్ వాటర్ డ్రెయిన్ నిర్మాణ పనులు టన్నెలింగ్ పద్ధతిలో చేపట్టబడ్డాయని తెలిపారు. ప్రస్తుతం పనులు పురోగతిలో ఉన్నాయని, పనులు పూర్తయిన అనంతరం ఈ ప్రాంతంలో నీటి నిల్వ సమస్య పూర్తిగా తొలగిపోతుందని తెలిపారు.

**వనస్థలిపురంలో..**

వనస్థలిపురం జాతీయ రహదారిపై కేఎల్‌ఎం షాపింగ్ మాల్ ఎదురుగా ఉన్న ప్రాంతం భారీ వర్షాల సమయంలో నీటి నిల్వ ప్రాంతంగా గుర్తించబడిందని తెలిపారు.ఎఫ్‌సీఐ కాలనీ, ఫేజ్4 కాలనీ, ప్రశాంత్ నగర్, అభ్యుదయ నగర్, చింతలకుంట గ్రామం, జహంగీర్ నగర్, ఆర్‌టీసీ కాలనీ తదితర పరిసర ప్రాంతాల నుండి భారీగా వచ్చే వర్షపు నీరు ఈ లోతట్టు ప్రాంతంలో చేరడం వల్ల నీటి నిల్వ ఏర్పడుతోందని తెలిపారు. ప్రస్తుతం ఉన్న చింతలకుంట కల్వర్ట్ ద్వారా మొత్తం నీరు ఒకేసారి బయటకు వెళ్లకపోవడంతో తాత్కాలికంగా రహదారిపై నీరు నిలిచేదని, ఈ సమస్య పరిష్కారానికి ట్రెంచ్‌లెస్ టన్నెలింగ్ విధానంలో చింతలకుంట కల్వర్ట్‌కు అదనంగా 1000 మి.మీ వ్యాసం గల వెంట్‌ను ఏర్పాటు చేసి, దానిని అఘమయ్య కాలనీలోని ప్రస్తుత స్టార్మ్ వాటర్ డ్రెయిన్‌తో అనుసంధానం చేశారని తెలిపారు. .ప్రస్తుతం పనులు పూర్తైన అనంతరం ఈ ప్రాంతంలో నీటి నిల్వ సమస్య పూర్తిగా నివారించబడిందని తెలిపారు. .ప్రజల భద్రతకు ప్రాధాన్య వర్షాకాలంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా నీటి నిల్వ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి, శాశ్వత పరిష్కార చర్యలను వేగవంతం చేస్తున్నామని అధికారులు తెలిపారు. అలాగే అన్ని ప్రధాన నాలాలు, స్టార్మ్ వాటర్ డ్రెయిన్‌లను నిరంతరం డీసిల్టింగ్ చేస్తూ వర్షపు నీటి ప్రవాహాన్ని సజావుగా కొనసాగించేలా చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో బోయిన్‌పల్లి సర్కిల్ డీసి ఢాకు నాయక్, ఈఈ వెంకటేశ్వర్లు, ఉప్పల్ డీసి శైలజ, ఎస్‌ఈ హరి కిషోర్ గారు, డీఈఈ వెన్నెల్ గౌడ్, ఎల్‌బి నగర్ డిసి భోనగిరి శ్రీనివాస్, ఈ ఈ నాగేందర్ ఇతర సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## లోపాలు లేని ఓటర్ల జాబితా రూపొందించడమే లక్ష్యం

**-జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి.కర్ణన్**
**"సర్"పై వివిధ రాజకీయ పార్టీలతో సమావేశం**



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.వి.కర్ణన్, కలెక్టర్ ప్రియాంక అల, అడిషనల్ కమిషనర్ చంద్రకళ

**హైదరాబాద్,జూన్ 17,ప్రభాతవార్త:** పారదర్శకమైన, సమగ్రమైన లోపాలు లేని ఓటర్ల జాబితాను రూపొందించడం సర్ ప్రధాన లక్ష్యమని జిల్లా ఎన్నికల అధికారి జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ తెలిపారు. ఈమేరకు బుధవారం హైదరాబాద్ జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా, అదనపు కమిషనర్ (ఎన్నికలు) కుమారి కె. చంద్రకళతో కలిసి, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) పై సమావేశం నిర్వహించారు.జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన ఈసమావేశానికి వివిధ రాజీయ పార్టీల ప్రతినిధులు హాజరయ్యారు. ఈసందర్భంగా ఆర్.వి. కర్ణన్ మాట్లాడుతూ అర్హులైన ఓటర్లందరికీ ఎన్యుమరేషన్ ఫారమ్‌లను పంపిణీ చేస్తామని తెలియజేశారు. సవరణ ప్రక్రియలో బూత్ స్థాయి అధికారులకు పూర్తి సహకారం అందించాలని, వారి విధులకు ఎటువంటి ఆటంకం కలగకుండా చూడాలన్నారు. నిర్ణీత గడువులోగా సరిగ్గా నింపిన ఫారమ్‌లను సమర్పించాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. అంతేకాకుండా, ఎన్యుమరేషన్ ఫారమ్‌లను సమర్పించని ఓటర్ల పేర్లు ముసాయిదా ఓటర్ల జాబితాలో చేర్చబడకపోవచ్చని వివరించారు. ఈసందర్భంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు పలు సందేహాలను లేవనెత్తగా అధికారుల బృందం వాటికి తగిన వివరణ ఇచ్చారు.

## వర్షపు నీరు నిల్వ కాకుండా చర్యలు చేపట్టాలి

**: ఎంఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి**

**హైదరాబాద్, జూన్ 17 ప్రభాతవార్త :** నాచారం సర్కిల్ పరిధిలోని హబ్సిగూడ జహీర్‌నగర్ కాలనీలో ఎంఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, ఐఏఎస్ బుధవారం పర్యటించి వర్షపు నీరు నిలిచే ప్రాంతాలను పరిశీలించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో మాట్లాడిన కమిషనర్, వర్షాకాలంలో నీరు నిల్వ కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ చెత్తను బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. వర్షపు నీరు నిలిచిన ప్రాంతాల్లో మ్యాన్‌హోల్ మూతలను ప్రజలు స్వయంగా తెరవవద్దని, అలాంటి పరిస్థితులు ఎదురైనప్పుడు వెంటనే ఎంఎంసీ అధికారులు లేదా సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. ప్రజల సహకారంతోనే వర్షాకాల సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొనవచ్చని ఆయన తెలిపారు.

## ప్రతి మహిళకు భరోసా కల్పించేలా కమిషన్ పనిచేయాలి

**- రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్.గద్వాల విజయలక్ష్మి**




సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న గద్వాల విజయలక్ష్మి.

**బేగంపేట జూన్ 17,ప్రభాతవార్త** సమస్యల పరిష్కారానికి మహిళా కమీషన్ ను ఆశ్రయించే వారి సంఖ్య రోజు రోజుకి పెరుగుతుందని,ప్రతి మహిళకు న్యాయం జరుగుతుందనే భరోసా కల్పించేలా కమీషన్ పనిచేయాలని,తెలంగాణా రాష్ట్ర మహిళా కమీషన్ సర్వసభ్య సమావేశంలో తెలంగాణా రాష్ట్ర మహిళా కమీషన్ ఛైర్ పర్సన్ గద్వాల విజయలక్ష్మి అన్నారు.బుధవారం బుద్ధభవన్‌లోని తెలంగాణా రాష్ట్ర మహిళా కమీషన్ కార్యాలయంలో తెలంగాణా రాష్ట్ర మహిళా కమీషన్ సర్వసభ్య సమావేశం జరిగింది.నూతన కార్యవర్గం ఏర్పడిన తర్వాత నిర్వహించిన తొలి సర్వ సభ్యసమావేశం ఛైర్ పర్సన్ గద్వాల విజయలక్ష్మి అధ్యక్షతన జరిగింది.ఈ సమావేశంలో సభ్యులతో పాటు కమీషన్ కార్యదర్శి,సెక్షన్ ఆఫీసర్లు,ఫ్యామిలీ,లీగల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.ముందుగా ఇప్పటి వరకు కమీషన్‌లో నమోదైన కేసులు,పరిష్కారం అయిన కేసులపై ఛైర్మన్ సమీక్ష నిర్వహించారు.నమోదవుతున్న కేసులలో అత్యధికంగా నమోదవుతున్న జిల్లాలపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు.సమస్యలు పరిష్కరించడంలో కమీషన్ ముందుండాలని కోరారు.ఇక్కడికి వచ్చే వారంతా ఎంతో బాధతో వస్తుంటారని,వారి సమస్యలను ఓపికగా విని పరిష్కరించాలన్నారు.బాధితులకు న్యాయం చేయాలన్నారు.సమస్యలు ఏ సమయంలో వచ్చినా తన దృష్టికి తీసుకు రావాలన్నారు.అన్ని వేళల్లో తాను అందుబాటులో ఉంటానన్నారు.సభ్యులు వారానికి మూడు నాలుగు రోజులు తప్పని సరిగా హాజరు కావాలన్నారు.కమీషన్‌ను మారుమూల ప్రాంతాల వరకు తీసికెళ్లేలా కమిషన్ పనిచేయాలని గద్వాల విజయలక్ష్మి సూచించారు.రాష్ట్ర మహిళా కమీషన్ పనితీరు ఇతర రాష్ట్రాల కంటే మెరుగ్గా,చురుగ్గా,ఉండాలని,దేశంలోనే ఆదర్శంగా తెలంగాణా మహిళా కమీషన్ ను నిలబెట్టాలని ఛైర్ పర్సన్ సూచించారు.న్యాయం జరుగుతుంది అనే నమ్మకాన్ని మహిళల్లో కల్పించినపుడే కమీషన్ సమర్థవంతంగా పనిచేస్తున్నట్లు అర్థం అని గద్వాల విజయలక్ష్మి అన్నారు.

## మొహర్రం ఊరేగింపునకు అన్ని ఏర్పాట్లు

**: మంత్రి మహ్మద్ అజారుద్దీన్**



డబీర్‌పురలోని బీబీ-కా-ఆలంను సందర్శించిన రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మహ్మద్ అజారుద్దీన్

**చార్మినార్,జూన్ 17 ప్రభాతవార్త :** హైదరాబాద్ పాతబస్తీ డబీర్‌పురలోని బీబీ-కా-ఆలంను బుధవారం రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మహ్మద్ అజారుద్దీన్ సందర్శించారు.ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మహ్మద్ అజారుద్దీన్ మాట్లాడుతూ మొహర్రం పదివ రోజున ఈ నెల 27వ తేదీన జరగనున్న డబీర్‌పురలోని బీబీ-కా-అలం ఊరేగింపుకు ఎటువంటి ఇబ్బందులు లేకుండ ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని తెలిపారు.కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు సయ్యద్ ఖాలీద్ సైపుల్లా,ముతావలీ మహ్మద్ ముజాఫర్ హుస్సేన్ అలందార్ కమర్ హుస్సేన్ రజ్వీతో పాటు పలువురు పాల్గొన్నారు.

## అసిఫ్‌నగర్‌లో సిఎండీ జితేష్ పాటిల్ పర్యటన

**-విద్యుత్ నెట్‌వర్క్ లైన్‌టులైన్ పరిశీలన**
**-అంతరాయాలు లేకుండా చూడాలని అధికారులకు ఆదేశం**



అసిఫ్‌నగర్‌లో పర్యటిస్తున్న సిఎండీ జితేష్‌విపాటిల్, ఎస్‌ఈ చంద్రమోహన్, డీఈ విజయ్‌కుమార్, సుధీర్ తదితరులు

**హైదరాబాద్, జూన్ 17,ప్రభాతవార్త:** మాన్సూన్ సన్నద్ధతలో భాగంగా నిర్వహిస్తున్న "పోల్స్ అండ్ లైన్స్ స్పెషల్ డ్రైవ్ - వాక్ అలోంగ్ ది లైన్" కార్యక్రమంలో భాగంగా టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్ బుధవారం మేహదీపట్నం డివిజన్ పరిధిలోని ఆసిఫ్ నగర్ కాలనీలో క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించారు.ఉదయం 9.00 గంటల నుంచి ప్రాంభమైన ఈ పర్యటనలో విద్యుత్ నెట్‌వర్క్‌ను లైన్‌టులైన్ సర్వే ద్వారా పరిశీలించారు. విద్యుత్ స్తంభాలు, హెచ్.టి./ఎల్.టి. లైన్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, జంపర్లు, సర్వీస్ కనెక్షన్లు ఇతర మౌలిక సదుపాయాల పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆసిఫ్ నగర్‌లోని పబ్లిక్ డీటీఆర్‌ను సందర్శించి పరిశీలించారు. నిర్మల ఆసుపత్రి సమీపంలోని 11 కేవీ ఫీడర్‌ను తనిఖీ చేసి, డిస్ట్రిబ్యూషన్ బాక్స్ నిర్వహణ, ఎల్‌పీ ఫ్యూజ్ వైర్ల అమరిక, భద్రతా ప్రమాణాల అమలును పరిశీలించారు. తనిఖీల్లో గుర్తించిన నెట్‌వర్క్ లోపాలు, లైన్ క్లియరెన్స్ సమస్యలు, దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలు, పెండింగ్ రెక్టిఫికేషన్ పనులను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదులపై సిబ్బంది తక్షణమే స్పందించాలని సూచించారు. మాన్సూన్ కాలంలో విద్యుత్ అంతరాయాలు తగ్గించేందుకు ఫీడర్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, హెచ్.టి./ఎల్.టి. నెట్‌వర్క్‌ల నిర్వహణ పనులను వేగవంతం చేయాలన్నారు. అలాగే చెట్ల కొమ్మల కత్తిరింపు, లైన్ క్లియరెన్స్ మరియు నివారణ నిర్వహణ చర్యలను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు ఆదేశించారు.ఈకార్యక్రమంలో సెంట్రల్ సర్కిల్ ఎస్‌ఈ చంద్ర మోహన్, డీఈ సుధీర్, ఆపరేషన్స్ డీఈ విజయ కుమార్, ఏడీఈ (ఏసీగార్డ్స్) సత్యనారాయణ, ఏడీఈ నాజియా, ఏఈ విజయనగర్‌కాలనీ,విద్యుత్ శాఖ అధికారులు, పాల్గొన్నారు.

### కళాకారులకు ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ గుర్తింపు కార్డులు

**రవీంద్రభారతి, జూన్ 17 ప్రభాతవార్త :** రాష్ట్ర భాషా సాంస్కృతి కశాఖ ఆధ్వర్యంలో తెలంగాణ కళాకారులకు గుర్తింపు కార్డులు ఇచ్చే ప్రక్రియ ప్రారంభించినట్లు సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డి బుధవారం తెలిపారు. ఈమేరకు తెలంగాణ ప్రజానాట్యమండలి కళాకారులు సాంస్కృతిక మండలి సభ్యుడు పల్లె నరసింహతో రవీంద్రభారతి ప్రాంగణంలో కళాభవన్‌లోని సంచాలకుడు నరసింహారెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా డా. ఏనుగు నరసింహారెడ్డి మాట్లాడుతూ నేటి నుండి కళాకారులకు గుర్తింపు కార్డుల జారీచేసే కార్యక్రమం ప్రారంభమైందని, కళాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్రతీ కళాకారుడికి గుర్తింపు కార్డునిచ్చే విధంగా ప్రక్రియ కొనసాగుతుందని భరోసానిచ్చారు.

## వర్షాలు పడ్డాక స్పందిస్తారా ..?

**-మాన్‌సూన్ పనులపై జిహెచ్ంఎసి మౌనం**
**-క్షేత్రస్థాయిలో కనిపించని అధికారులు సిబ్బంది**
**-వాటర్‌లాగిన్ పాయింట్ల వద్ద ఎక్కడిచెత్త అక్కడే**
**-అధికారులు మేల్కొనాలంటున్న సిటీ జనం**




**హైదరాబాద్,జూన్ 17,ప్రభాతవార్త:** నగరంలో చిన్నపాటి వర్షం పడితే చాలు.. ప్రధాన రహదారులు కాలువలను తలపిస్తున్నాయి. ముఖ్యంగా ఐటీ కారిడార్, జూబ్లీహిల్స్, మాదాపూర్, గచ్చిబౌలి, కూకట్‌పల్లి, ఎల్బీనగర్, ఉప్పల్ వంటి ప్రాంతాల్లో వర్షపు నీరు రోడ్లపై నిలిచి వాహనదారులకు చుక్కలు చూపిస్తోంది. రద్దీ ప్రాంతాల్లో కిలో మీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించిపోతుండగా.. ఉద్యోగులు, విద్యార్థులు గంటల తరబడి రోడ్లపైనే చిక్కుకుపోతున్నారు .మాన్సూన్ సన్నద్ధతపై ప్రభుత్వ స్థాయిలో సమీక్షలు, హెచ్చరికలు కొనసాగుతున్నా.. జీహెచ్ఎంసీ ఉన్నతాధికారుల్లో మాత్రం ఆశించిన చలనం కనిపించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా సమన్వయ లోపాలపై ఆగ్రహం వ్యక్తం చేసి, ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించినప్పటికీ.. జిహెచ్ఎంసి అధికారులు పెడచెవుఉన పెడుతున్నట్లు తెలుస్తుంది. నగరంలో చిన్నపాటి వర్షానికే రహదారులు జలమయమవుతున్నాయి. వాటర్ లాగింగ్, ట్రాఫిక్ జామ్‌లు, పూర్తి కాని నాలాల పూడికతీత పనులు, కొనసాగుతున్న రోడ్ల తవ్వకాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మాన్సూన్ సీజన్ మొదలై రెండు భారీ వర్షాలు కురిసినా.. జీహెచ్ఎంసీ అధికార యంత్రాంగం ఇంకా పూర్తిస్థాయిలో ఫీల్డ్‌లోకి దిగలేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా మాన్సూన్ యాక్షన్ ప్లాన్ అమలు చేయాలని ఆదేశించినా..అనేక విభాగాల మధ్య సమన్వయం లోపించడం పరిస్థితిని మరింత క్లిష్టంగా మారుస్తోంది. సీఎం ఆదేశాలతో సీఎంసీ, ఎంఎంసీ అధికారులు ఫీల్డ్ విజిట్లు నిర్వహిస్తూ కార్యాచరణ రూపొందిస్తుండగా జీహెచ్ఎంసీ స్థాయిలో మాత్రం ఆశించిన వేగం కనిపించడం లేదని స్థానికులు అంటున్నారు.

**నీళ్లు నిలిస్తేనే వస్తారా..?**

మూడు పోలీస్ కమిషనరేట్ల పరిధిలో దాదాపు వెయ్యికి పైగా వాటర్ లాగింగ్ పాయింట్లను అధికారులు ఇప్పటికే గుర్తించారు. ఎక్కడెక్కడ ముంపు సమస్యలు తలెత్తుతాయో సంబంధిత శాఖలకు స్పష్టమైన సమాచారం ఉన్నప్పటికీ.. వర్షం పడకముందే తీసుకోవాల్సిన చర్యలు అమలు కావడం లేదు. మోటార్ల ఏర్పాటు, నీటి తొలగింపు, ట్రాఫిక్ డైవర్షన్లు, అత్యవసర బృందాల మోహరింపు వంటి అంశాలు కాగితాలకే పరిమితమవుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. ఫలితంగా మోకాళ్ల లోతు వరద చేరిన తర్వాతే అధికారులు రంగంలోకి దిగుతున్నారు. కొన్ని చోట్ల వాహనాలు నీటిలో నిలిచిపోతుండగా మరికొన్ని ప్రాంతాల్లో వాహనాలు కొట్టుకుపోయే పరిస్థితులు కూడా ఏర్పడుతున్నాయి. నగరంలోని పలు లోతట్టు ప్రాంతాల్లో ఇదే పరిస్థితి కొనసాగుతుండటంతో ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**పూర్తికాని పూడికతీత పనులు..**

మరోవైపు మే నెలాఖరుకే పూర్తి కావాల్సిన నాలాల పూడికతీత పనులు ఇంకా పూర్తికాలేదు. అనేక ప్రాంతాల్లో రోడ్ల తవ్వకాల మరమ్మతులు కూడా పెండింగ్‌లోనే ఉన్నాయి. వర్షాకాలానికి ముందు పూర్తి చేయాల్సిన డ్రైనేజీ, స్టార్మ్ వాటర్ డ్రెయిన్, రోడ్ల పునరుద్ధరణ పనులు ఆలస్యం కావడంతో వర్షపు నీరు రోడ్లపై నిలిచిపోతోంది. పరిస్థితి ఇలాగే కొనసాగితే రానున్న రోజుల్లో భారీ వర్షాల సమయంలో నగరం మరింత ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. మాన్సూన్ సీజన్ పీక్ స్టేజ్‌కి చేరుకునేలోపు జీహెచ్ఎంసీ అధికారులు క్షేత్రస్థాయిలో యాక్షన్ తీసుకోవాలని నగర ప్రజలకు కోరుతున్నారు.

## సీజనల్ వ్యాధులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి : డిఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న డిఎంహెచ్‌వో డాక్టర్ పుట్ల శ్రీనివాస్ తదితరులు

**హైదరాబాద్, జూన్ 17,ప్రభాతవార్త:** వైద్యాధికారులు సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని గర్భిణీ స్త్రీలకు అన్నిరకాల ఆరోగ్యసేవలు అందించాలని డిఎంహెచ్‌వో డా.పుట్ల శ్రీనివాస్ ఆదేశించారు. ఈమేరకు బుధవారం అంబర్‌పేట్ క్లస్టర్ పరిధిలోని బాగ్ అంబర్‌పేట్ ,ముషీరాబాద్ యుపిహెచ్‌సి బోలక్‌పూర్, హరాజ్‌పెంట,తిలక్‌నగర్ యుపిహెచ్‌సిలకు చెందిన వైద్యాధికారులు, సూపర్వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు,ఏఎన్ఎం ఆశా కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పుట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన, అందుబాటులో ఉండే ఆరోగ్య సేవలను సమర్థవంతంగా అందించడం ప్రతి ఆరోగ్య సిబ్బంది బాధ్యత అని పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రజారోగ్య కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని, గర్భిణీల సంరక్షణ, వ్యాధి నిరోధక టీకాలు, అంటువ్యాధుల నివారణ, సీజనల్ వ్యాధుల నియంత్రణ , ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా కీటక జనిత వ్యాధులైన మలేరియా, డెంగీ, చికున్ గునియా పై ఇంటింటి ఆరోగ్య సర్వేలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అలాగే, ఆరోగ్య సేవల పట్ల ప్రజల్లో మరింత అవగాహన కల్పించి, ప్రతి అర్హులైన లబ్ధిదారునికి ప్రభుత్వ ఆరోగ్య పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా. శ్రీధర్, అదనపు డిఎంహెచ్‌వో డా. అనిత , డా. శ్రీకళ, డా.ఆశ్రిత రెడ్డి ,జిల్లా మీడియా అధికారి జక్కుల రాములు తదితరులు పాల్గొన్నారు.

## వర్షం నిలిచే ప్రాంతాల్లో పర్యటించిన అధికారులు



ఫిల్మ్‌నగర్‌లో అధికారులతో కలిసి పర్యటిస్తున్న మామిడి నర్సింగ్‌రావు, చిత్రంలో మణిశర్మ ఉన్నారు.

**జూబ్లీహిల్స్, జూన్ 17, ప్రభాతవార్తః**

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆదేశాల మేరకు ఫిల్మ్‌నగర్‌లోని పలు ప్రాంతాల్లో ఫిల్మ్‌నగర్ 18 బస్తీల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మామిడి నర్సింగ్‌రావు ఆధ్వర్యంలో జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఫిల్మ్‌నగర్‌లోని సాయిబాబా గుడి ప్రాంతంలో జీహెచ్‌ఎంసి ఈఈ విజయకుమార్, ఏఈ వెంకటేష్‌తో కలిసి పర్యటించారు. వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని పలు బస్తీల్లో పర్యటించి వర్షాకాలంలో ఏ ఇబ్బంది లేకుండా ఫిల్మ్‌నగర్‌తోపాటు చుట్టూ ఉన్న బస్తీలలో రోడ్లు, డ్రైనేజీలు, వాటర్ లైన్ సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పటేల్‌నగర్ నుంచి కొత్త చెరువు మీదుగా బీజేఆర్ నగర్, బాల్‌రెడ్డి నగర్ తూర్పువైపు నుంచి తుమ్మల కుంట వరకు బాక్స్ టైప్ డ్రైన్ నిర్మాణ పనులను పరిశీలించారు. ప్రధానంగా వర్షపు నీరు నిలిచిపోయే ప్రాంతాలను పరిశీలించారు. వారి వెంట సినీ సంగీత దర్శకుడు మణిశర్మ, స్థానికులైన గుంటి నగేష్ సాగర్, ఆకుల రాజు, ఆర్. ఎల్లయ్య, అబ్దుల్ ఘని, సంపంగి కిరణ్, సహదేవ్, దిండి వెంకటస్వామి, దామోదర్, రామచంద్రయ్య, ఎస్పీ శీను, మోడల శేఖర్, నాగేంద్రం, లింగా చారి, గద్దల ప్రభాకర్, ఆంధ్ర శీను వివిధ బస్తీల నాయకులతో కలిసి పర్యటించారు.

## టీపీఎస్ ప్రారంభోత్సవానికి తరలిన విద్యార్థులు



ఆరుట్లలో నిర్మించిన తెలంగాణ పబ్లిక్ స్కూల్ ప్రారంభోత్సవానికి పాతబస్తీ నుండి తరలి వెళుతున్న బహదూర్‌పురా డిప్యూటీ ఈవో సుమన్, ఉపాధ్యాయులు

**చాంద్రాయణగుట్ట, జూన్ 17, ప్రభాతవార్త :**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రంగారెడ్డి జిల్లా మంచాల మండలంలోని ఆరుట్లలో సుమారు 15 కోట్ల రూపాయలతో నిర్మించిన తెలంగాణ పబ్లిక్ స్కూల్ (టిపిఎస్) ప్రారంభోత్సవానికి పాతబస్తీలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు తరలి వెళ్ళారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టీజీఎస్‌ఆర్టీసి బస్సులను బహదూర్‌పురా జోన్ ఉప విద్యాశాఖ అధికారి (డిప్యూటీ ఈవో) ఆర్.సుమన్ ప్రారంభించారు. ఆ జోన్ డిప్యూటీ ఐఓఎస్‌లు వెంకట్‌రెడ్డి, నరేందర్ యాదవ్‌లు సమన్వయం చేశారు. అక్కడి పాఠశాలను అంతర్జాతీయ స్థాయిలో నిర్మించి, అన్ని సౌకర్యాలు కల్పించిన తీరును ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటే భవిష్యత్ బాగుంటుందనే ఆలోచనను వారిలో స్ఫురింపజేశారు. క్రీడా మైదానాలు, గ్రంథాలయం, డిజిటల్ తరగతి గదులు, భోజనశాల, నృత్యం, సంగీత తరగతులు తదితరాలను పరిశీలించారు. విశాలమైన పాఠశాల, పచ్చదనం విద్యార్థులను ఆకట్టుకుంది. ఆరుట్లకు తరలి వెళ్లిన వారిలో ప్రధానోపాధ్యాయులు మందడి వెంకట్‌రెడ్డి, అలువాల శ్రీనివాస్, ఉపాధ్యాయులు శ్రీవాటి శ్రీనాథ్,టి.జె.శ్రీధర్, రవికాంత్ ఉన్నారు.

## అక్షరజ్ఞాని అక్కిరాజు జనార్ధనరావుకు ఆత్మీయ సత్కారం



అక్షరజ్ఞాని అక్కిరాజు జనార్ధనరావును సత్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి జూన్ 17 ( ప్రభాతవార్త ) :** 30 ఏళ్ల పాటు అవిశ్రాంతంగా సాంస్కృతిక విలేకరిగా సేవలందించిన అక్కిరాజు జనార్ధనరావుకు ఆయన 93వ జన్మదినం సందర్భంగా సాంస్కృతిక విలేకరుల బృందం బుధవారం ఆత్మీయ సత్కారం చేసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వృత్తి పట్ల అంకితభావం, నిజాయితీతో పని చేస్తూ నేటి తరం జర్నలిస్టులకు ఆయన మార్గదర్శకుడిగా నిలిచారని కొనియాడారు. కేవలం జర్నలిస్టుగానే కాకుండా, పలు ఆంగ్ల గ్రంథాలను తెలుగులోకి అనువదించి సాహిత్య రంగానికి ఎనలేని సేవలు అందించారని, ఉత్తమ కథా రచయితగా కూడా మంచి గుర్తింపు పొందారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జనార్ధనరావును అక్షర జ్ఞాని బిరుదుతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు రామ్ రెడ్డి, ముడుంబై శ్రీనివాస్, కె.శ్రీనివాస్, పరశురామ్, సతీష్, అఖిలేష్, శ్రీనాథ్, సుధీర్, రాయప్రోలు వెంకటరమణ, కనకాచారి పాల్గొన్నారు.

## పెండింగ్ ప్యాచ్ వర్క్ పనులను వెంటనే పూర్తి చేయాలి

**: మాజీ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్**



జలమండలి ఎండీ కె.అశోక్ రెడ్డిని కలిసి సమస్యలను వివరిస్తున్న గాంధీనగర్ మాజీ కార్పొరేటర్ ఎ.పావని వినయ్ కుమార్

**చిక్కడపల్లి జూన్ 17 ( ప్రభాతవార్త ) :** గాంధీనగర్ డివిజన్ అరుంధతి నగర్ బస్తీలో నూతన సీవారేజీ పైప్‌లైన్ పనుల అనంతరం పెండింగ్‌లో ఉన్న రోడ్డు ప్యాచ్ వర్క్ పనులను వెంటనే చేపట్టాలని మాజీ కార్పొరేటర్ ఎ.పావని వినయ్ కుమార్ జలమండలి ఎండీ కె.అశోక్ రెడ్డిని కోరారు. బుధవారం జలమండలి కార్యాలయంలో ఆమె ఎండీని కలిసి వినతిపత్రం సమర్పించారు. మాజీ కార్పొరేటర్ మాట్లాడుతూ పైప్‌లైన్ పనులు పూర్తయినా, రోడ్లను పునరుద్ధరించకపోవడంతో స్థానిక బస్తీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గతంలో జలమండలి ఈడీ మరియు డైరెక్టర్లను కలిసి సమస్యను వివరించినా ఎలాంటి స్పందన లేదని, ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎండీ అశోక్ రెడ్డి, పెండింగ్ పనులకు సంబంధించి వెంటనే టెండర్ ప్రక్రియ పూర్తి చేసి, పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్ పాల్గొన్నారు.



నాంపల్లిలోని రాష్ట్ర మీడియా అకాడమీ ఆడిటోరియంలో జర్నలిస్టుల కుటుంబాలకు చెక్కులు అందజేస్తున్న చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి

## మహాద్వార పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే నవీన్‌యాదవ్



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే నవీన్‌యాదవ్, చిన్న శ్రీశైలంయాదవ్ తదితరులు.

**జూబ్లీహిల్స్, జూన్ 17, ప్రభాతవార్తః**

యూసఫ్‌గూడ డివిజన్‌లోని యాదగిరి నగర్‌లో ఉన్న రేణుక ఎల్లమ్మ తల్లి మహాద్వారం(కమాన్) నూతన నిర్మాణ పనులను జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వల్లాల నవీన్ యాదవ్, బీసీ జేఏసీ చైర్మన్ వల్లాల చిన్న శ్రీశైలం యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. భక్తుల మనోభీష్టాలను నెరవేర్చే రేణుక ఎల్లమ్మ తల్లి కృపాకటాక్షాలు యాదగిరి నగర్, నియోజకవర్గ ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని ఎమ్మెల్యే ప్రార్థించారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రాంత ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఆలయ అభివృద్ధి, ఆధ్యాత్మిక వాతావరణ పరిరక్షణకు తన వంతు సహకారం అందిస్తానని హామినిచ్చారు. బస్తీలో నెలకొన్న సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకురావాలని స్థానిక ప్రజలకు సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని అయన హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానికులు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

**జలమండలి అధికారులతో..**

రహమత్‌నగర్ డివిజన్‌లో ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన చేశాదరు. ఎస్పీఆర్ హిల్స్ జలమండలి కార్యాలయంలో అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. 56 బస్తీలకు ఎస్పీఆర్ హిల్స్ రిజర్వాయర్ నుంచి తాగు నిటి సరఫరాను చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అనంతరం అక్కడి నుంచి కార్మికనగర్ ఆటో స్టాండ్ వరకు కొనసాగుతున్న వాటర్ పైప్‌లైన్ పనులను పాదయాత్ర చేస్తూ పరిశీలించారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీసీ ఉమ, జీఎం కృష్ణకుమార్, డీజీఎం సురేష్‌కుమార్, మేనేజర్ రాజేందర్, డీఈఈ రాజేశ్వరి, జీహెచ్‌ఎంసీ నుంచి మోహన్, ముజమీర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం యూసుఫ్‌గూడ చెక్‌పోస్టులోని ప్రభుత్వ పాఠశాలను ఎమ్మెల్యే ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాల ఆవరణలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించాలని ఆదేశించడంతో అధికారులు అప్రమత్తమై వెంటనే తొలగించారు. మరుగుదొడ్లు, టాయిలెట్లను మరమ్మతులు చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. పాఠశాలలోని సమస్యలను నిర్దేశిత గడువులో పరిష్కరించాలని అధికారులకు సూచించారు

## వర్షాకాలంలో అధికారులు,సిబ్బంది సమన్వయంతో పనిచేయాలి

**-రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి, ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే

**అత్తాపూర్ జూన్ 17,ప్రభాతవార్త :** వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా అన్ని విభాగాల అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి కోరారు. బుధవారం రాజేంద్రనగర్ జోనల్ కార్యాలయంలో జోన్ పరిధిలోని వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో ఆయన సమన్వయ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సోలిపేట శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ జోన్ పరిధిలో వర్షాకాలంలో రోడ్ల పై నీరు నిల్వ ఉండే 11 ప్రాంతాలను గుర్తించడం జరిగిందన్నారు . ఆ ప్రాంతాలలో శాశ్వత సమస్య పరిష్కారం కోసం అవకాశం లేని చోట తాత్కాలిక పరిష్కారం చేసేలా అన్ని విభాగాల అధికారులు ముందుండి పని చేయాలన్నారు. ఉప్పర్ పల్లి పిల్లర్ నెంబర్ 191 వద్ద మాన్యువల్స్ ను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ వర్షాలు వచ్చినప్పుడు అప్రమత్తంగా ఉండి నీరు సులభంగా వెళ్లడానికి అవకాశం కల్పించాలన్నారు. పిల్లల నెంబర్ 300 వద్ద రోడ్డుపై నీరు నిలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రాందేవ్ బాబా దేవాలయం ప్రాంతంలో రోడ్లపై నీరు నిలిచి ఉంటుందని ఆ సమస్యను పరిష్కరించడానికి బుధవారం పనులు ప్రారంభించడం జరిగిందన్నారు. బహదూర్ పుర పిజ్జా హోటల్ వద్ద నీరు నిలవకుండా చూడాలన్నారు. మన్మోహన్ సింగ్ బ్రిడ్జి పైన, ఓల్డ్ కర్నూలు రోడ్డులో నీరు నిలవకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. కరెంటు తీగలకు తగులుతున్న చెట్లను తొలగించడానికి విద్యుత్ శాఖ అధికారులు కృషి చేయాలని, అవసరమైన చోట జిహెచ్ ఎంసి అర్బన్ బయోడైవర్సిటీ సిబ్బందిని కూడా వాడుకోవాలని సూచించారు. కెన్వర్ట్ మార్గంలో నీరు నిల్వ ఉండకుండా చేయడానికి నిధులు మంజూరయ్యాయని వాటితో భవాని కాలనీ ప్రజలతో మాట్లాడి పైపు లైన్ వేయడానికి ప్రయత్నం చూస్తామన్నారు. ఆరాంఘర్ ఆర్టీసీ బస్ స్టాప్ వద్ద బస్సు షెల్టర్లను దూరంలో ఏర్పాటు చేసేలా చేస్తే ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టవచ్చున్న ట్రాఫిక్ అధికారుల సూచనలు పరిగణనలోకి తీసుకొని ఆ విధంగా చేయడానికి కృషి చేస్తామన్నారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో జిహెచ్‌ఎంసి ఈఈ నరేందర్ గౌడ్, డిప్యూటీ కమిషనర్ లు మల్లయ్య, అరుణకుమారి, పాపయ్య, ఎస్ ఈ నరేందర్ గౌడ్, టౌన్ ప్లానింగ్ ఎసిపి లు సుధాకర్, శ్రీధర్, రాజేంద్రనగర్ ఆర్టీసీ బస్సు డిపో మేనేజర్ బి కృష్ణా రెడ్డి, జలమండలి జనరల్ మేనేజర్ సాయి లక్ష్మీ ృ, విద్యుత్ రాజేంద్రనగర్ డీ ఈ పి రత్నా కర్ రావు, మహ్మద్ షఫీ ఉల్లా పాల్గొన్నారు.

## మూసి ప్రాజెక్టుపై ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోవాలి



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న మూసి జన్‌ఆందోళన్ ప్రతినిధులు

**హైదరాబాద్,జూన్ 17,ప్రభాతవార్త:**

ప్రభుత్వాలు ఎలాంటి ప్రాజెక్టులు ప్రారంభించాలనుకున్నా మొట్టమొదట అక్కడ నివసించే స్థానిక ప్రజల అభిప్రాయాలను, హక్కులను పరిగణనలోకి తీసుకోవాలని సామాజిక కార్యకర్తలు, మూసి జనాందోళన ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మూసీ జన ఆందోళన సభ్యులు సజయ, బిలాల్, బ్రదర్ వర్గీస్, ఆనంద్ రెడ్డి ,వైశాలి, శరత్ బాబు, పిఓడబ్ల్యూ ఝాన్సీ తదితరులు మాట్లాడారు. మూసి నది పరివాహక ప్రాంత అభివృద్ధి పేరుతో ప్రభుత్వం చేపడుతున్న ప్రాజెక్టును తక్షణమే ఉపసంహరించుకోవాలని, లేదా దానిని పర్యావరణ హితంగా మార్చాలని కోరారు. మూసి నది అభివృద్ధిని ముక్కలు ముక్కలుగా కాకుండా, మొత్తం నది పరివాహక ప్రాంతాన్ని ఒకే యూనిట్‌గా పరిగణించి సమగ్రంగా చూడాలని స్పష్టం చేశారు. ఇది కేవలం ఒక బ్యూటిఫికేషన్ (సౌందర్యీకరణ) ప్రాజెక్టు గానో లేదా కాలుష్యాన్ని నియంత్రించే సాధారణ ప్రాజెక్టు గానో మాత్రమే ఉండకూడదన్నారు. ప్రభుత్వ గెజెట్ ప్రకారం 3,000 ఎకరాలకు పైగా భూమి, 10,000కు పైగా కట్టడాలు ఈ ప్రాజెక్టు పరిధిలోకి వస్తున్నాయని.. దీనివల్ల దాదాపు లక్ష మందికి పైగా సామాన్య, పేద, మధ్య తరగతి ప్రజలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మూసి నది అంశంపై ప్రభుత్వం మార్చి 21వ తేదీన జీవో నంబర్ 406 ద్వారా ఉపముఖ్య మంత్రి భట్టి విక్రమార్క గారి ఆధ్వర్యంలో ఒక సబ్ కమిటీని ఏర్పాటు చేసిందని తెలిపారు. ఈ కమిటీ కోరిన విధంగా, తాము 15 రోజుల్లోనే మూసి జనాం దోళన తరఫున ఒక సమగ్రమైన నివేదికను ప్రభుత్వానికి సమర్పించామన్నారు. అయితే, ఏప్రిల్‌లో తాము ఇచ్చిన ఈ నివేదికకు జూన్ 9వ తేదీన ఎంఆర్‌డిసిఎల్ వైపు నుండి సమాధానం రావడం ఆశ్చర్యం కలిగించిందన్నారు. ఆ సమాధానంలో ఏ ఒక్క బాధ్యతగల అధికారి సంతకం కూడా లేకపోవడం ప్రజాస్వామ్య విరుద్ధమని మండిపడ్డారు. తాము అడిగిన నివేదికలోని అంశాలపై స్పష్టత ఇవ్వకుండా, అసలు ప్రస్తావించని విషయాలను అందులో చేర్చారని విమర్శించారు. జీవో 921 ప్రకారం ప్రాజెక్టు పేరుతో జరుగుతున్న భూసేకరణ ప్రక్రియలను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు.పాత చట్టాన్నే అమలు చేయాలని కోరారు. ప్రభుత్వం మొండిగా ముం దుకు వెళ్లకుండా ప్రజాభిప్రాయ సేకరణ, సమీక్షలు నిర్వ హించి ప్రజలతో మాట్లాడిన తర్వాతే ముందుకు వెళ్లాలని ఈ సందర్భంగా జన ఆందోళన్ సభ్యులు డిమాండ్ చేశారు.

## మల్లికార్జున్‌నగర్‌లో నూతన సీవరేజ్ పైప్‌లైన్ ప్రారంభం



**భాగ్ అంబర్‌పేట్ జూన్ 17,ప్రభాతవార్త :** నియోజకవర్గ పరిధిలోని భాగ్ అంబర్‌పేట్ మల్లికార్జున్ నగర్, రోజ్ బడ్స్ స్కూల్ వీధిలో రూ.3 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన సీవరేజ్ పైప్‌లైన్‌ను ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ , బిఆర్ఎస్ సీనియర్ నాయకులు వెంకీడరెడ్డితో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో డ్రైనేజీ సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పనులను వేగంగా పూర్తి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జలమండలి అధికారులు డీఈ శ్రీకృష్ణ, ఏఈ వెంకటేష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ, లక్ష్మణ్, జీహెచ్‌ఎంసీ డీఈ ప్రవీణ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి నాయక్, ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్ శ్రీనివాస్ మరియు బిఆర్ఎస్ నాయకులు శ్రీరాములు ముదిరాజ్, వినోద్ గౌడ్, నరహరి, సాయన్న, అరుణ్ రెడ్డి, చంద్రమోహన్, మహేష్, సతీష్, శివరామకృష్ణ, రమేష్ నాయక్, కిషోర్, బాబు, అమరావతి, జ్యోతి, స్వరూప తదితరులు పాల్గొన్నారు.



మొహర్రం సందర్భంగా ఎటువంటి ఇబ్బందులు కలగకుండ అన్ని ఏర్పాట్లు చేయాలని కోరుతూ నగర పోలీస్ కమిషనర్ వి.సి.సజ్జనర్‌ను కలిసి బిజెపి రాష్ట్ర మైనార్టీ మోర్చ మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ బుధవారం కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ఇచ్చిన రిఫరెన్స్ లేఖను అందజేశారు.ఈ కార్యక్రమంలో తొమ్మిదివ నిజాం ప్రతినిధి రౌనాఖ్ యార్ ఖాన్, సీనియర్ బిజెపి నాయకులు అల్కా మనోజ్ పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో కూలీ మృతి

**-నాలుగు రోజులు వ్యవధిలో రెండో ఘటన**

**అల్వాల్, జూన్ 17 ప్రభాతవార్త:**

విద్యుత్ షాక్‌కు మరో వ్యక్తి దుర్మరణం పాలైన సంఘటన అల్వాల్‌లో జరిగింది. నాలుగు రోజులు క్రితం తండ్రీ కూతురు షాక్‌కు మరణించిన సంఘటన తెలిసిందే. ఇది మరువక ముందే మరో ఘటన జరగడం స్థానికంగా చర్చాంశనీయంగా మారింది. విద్యుత్ శాఖ నిర్లక్ష్యం కారణంగానే వరుసగా ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. సంఘటనకు సంబంధించి పోలీసులు, స్థానిక ప్రజలు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. ఎంఇఎస్ కాలనీ మాధురి రెసిడెన్సీ అపార్ట్‌మెంట్‌కు అనుకుని విద్యుత్ తీగలు ఉండగా వాటికి చెట్లు కొమ్మలు అలముకుని ప్రమాదకరంగా ఉన్నాయి. కొమ్మలు కొట్టేందుకు అపార్ట్‌మెంట్ వాసులు రోజు వారీ కూలీ సూర్యనారాయణ(45) నియమించుకున్నారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఇతను జీవనోపాది కోసం నగరానికి వచ్చి అల్వాల్‌లో నివాసం ఉంటున్నాడు. బుధవారం ఉదయం బాధితుడు కొమ్మలు నరుకుతుండగా షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతనిని రక్షించేందుకు ప్రయత్నాలు చేసినా ఫలితం లేకుండా పోయింది. నాలుగు రోజులు గడవక ముందే ఒకే తరహాలో ముగ్గురు ప్రాణాలు కోల్పవడం పట్ల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ శాఖలు మధ్య సమన్వయం లోపం ప్రాణాల మీదకు తెస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ తీగలకు అనుకుని ఉన్న చెట్లు కొమ్మలను తీసి వేసే ప్రయత్నాలు జరగక పోవడం ప్రధాన సమస్యగా మారింది. అపార్ట్‌మెంట్ వద్ద విద్యుత్ తీగలు చెట్లు కొమ్మలు ప్రమాదకరంగా ఉన్నాయని అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించలేదని నివాసితులు పేర్కొంటున్నారు. బాధితుడు సూర్యనారాయణకు భార్య ముగ్గురు కుమారులు ఉన్నారు. కుటుంబ పెద్ద దిక్కు చని పోవడంతో భార్య కుమారులు రోడ్డున పడ్డారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## జూలై 22న ఎల్‌బీ స్టేడియంలో భారీ క్రిస్టియన్ జాతర

**- ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు సమగ్ర డిమాండ్ల చార్టర్**



ప్రసంగిస్తున్న తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్ పాస్టర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గోనే సాల్మన్ రాజ్ ఇతర ప్రతినిధులు

**చిక్కడపల్లి జూన్ 17, ప్రభాతవార్త :** క్రైస్తవ సమాజం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం, చట్టపరమైన రక్షణ, రాజకీయ ప్రాతినిధ్యం కోసం డిమాండ్ చేస్తూ జూలై 22న లాల్ బహదూర్ (ఎల్‌బీ) స్టేడియంలో భారీ క్రిస్టియన్ జాతర నిర్వహించనున్నట్లు ఉమ్మడి క్రైస్తవ ఐక్యవేదిక ప్రకటించింది. బుధవారం బాప్టిస్ట్ చర్చిలో జరిగిన మెయిన్ లైన్, ఇండిపెండెంట్, కాన్నిట్యూయెన్సీ పాస్టర్స్ ఫెలోషిప్స్ మరియు ప్రముఖ క్రైస్తవ సంస్థల కోర్ కమిటీ ఉన్నత స్థాయి సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశంలో టియుసిపిఏ, టి సి పి ఎఫ్, టీబీఎస్, టియుసీఎస్, ఏఐయుసీఎం ఈఆర్, యు పి పి ఎల్ ఎఫ్ తో పాటు వివిధ సంఘాల బిషప్‌లు, సీనియర్ పాస్టర్లు, బిషప్ కె. తిమోతి, రెవ. జయకుమార్, బ్రదర్ బెనోని రిచర్డ్, డాక్టర్ సి. హేమలత, ఎం. శాలిని, ప్రబోధ్ విల్సన్ తదితరులు పాల్గొన్నారు. ఈ చారిత్రాత్మక మహాసభకు తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండలాల నుండి దాదాపు లక్ష మంది క్రైస్తవులు తరలివస్తారని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. సమావేశ వివరాలను తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్ పాస్టర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గోనే సాల్మన్ రాజ్ మీడియాకు వెల్లడించారు. ఈ సందర్భంగా క్రైస్తవ సమాజం కోసం ఒక సమగ్ర డిమాండ్ల చార్టర్‌ను విడుదల చేశారు. దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి, క్రైస్తవులపై దాడులు, ద్వేషపూరిత ప్రసంగాల నియంత్రణకు కఠిన చట్టాలు తీసుకురావాలి. రాష్ట్రంలోని ప్రతి మండలంలో క్రైస్తవ సమాజం కోసం ప్రత్యేక శ్మశాన వాటికలకు భూములు కేటాయించాలి. ఈ మహాసభకు లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులను ఆహ్వానిస్తున్నట్లు నిర్వాహకులు ధృవీకరించారు.

## వివోఏ, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల డిమాండ్లను సిఎం దృష్టికి తీసుకెళతా : మొగుళ్ళ రాజిరెడ్డి





సమావేశంలో మాట్లాడుతున్న మొగుళ్ళ రాజిరెడ్డి

**సైఫాబాద్, జూన్ 17 ప్రభాతవార్త:**

రాష్ట్రంలో పనిచేస్తున్న వివోఏ, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారిస్తానని ఐఎన్‌టియుసి తెలంగాణ రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షుడు మొగుళ్ళ రాజిరెడ్డి హామీ ఇచ్చారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఐకెపి, వివోఏలకు నెలకు 3 వేల నుంచి 5 వేల వరకు చెల్లించి వారి జీవితాలను అంధకారంలోని నెట్టిందని ఆయన ఆరోపించారు. బుధవారం నారాయణగూడలోని ఐఎన్‌టియుసి కార్యాలయంలో తెలంగాణ ఐకెపి వివోఏ సంఘం (ఐఎన్‌టియుసి), తెలంగాణ రాష్ట్ర ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ (ఐఎన్‌టియుసి) సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రజా ప్రభుత్వం అధికారంలోని వచ్చిన తరువాత ఉద్యోగ, కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉందని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలతోపాటు ఆర్టీసీ, జలమండలి, కార్మికులను పరిష్కారించడంతోపాటు ఉద్యోగ, కార్మికులకు కనీస వేతనాలను పెంచిందని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఐకెపి, వివోఏలకు సమాన పనికి సమాన వేతనం నెలకు 26 వేలు, ఉద్యోగ భద్రత, బీమా వంటి డిమాండ్లను ముఖ్యమ ంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కల దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కారిస్తానని రాజిరెడ్డి హామీ ఇచ్చారు. ఐఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.నాగన్నగౌడ్ మాట్లాడుతూ గతంలో సమ్మె చేసిన వందలాది మంది ఉపాధి హామీ ఫిల్డ్ అసిస్టెంట్లను గత బిఆర్ఎస్ ప్రభుత్వం విధుల నుంచి తొలగించిందని ఆరోపించారు. దీనిపైన ఐఎన్‌టియుసి హైకోర్టులో కేసు వేయడంతో వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని హైకోర్టు తీర్పు ఇచ్చిందని గుర్తు చేశారు. ఉపాధి హామీ ఫిల్డ్ అసిస్టెంట్లకు నెలకు 26 వేల రూపాయలు వేతనం, ఉద్యోగ భద్రతతోపాటు ఎఫ్‌టిఈ వంటి న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కారిస్తామన్నారు. ఈ సమావేశంలో జలమండలి ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి టిపి రాఘవేంద్రరాజ్, సంఘాల నాయకులు పి.అరుణ్‌రెడ్డి, ఎన్.ప్రభాకర్, బి.రవి, సిద్ది రాజు, శ్రావణిరెడ్డి, కవిత, శరత్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## పెద్దమ్మను కలిసి యోగక్షేమాలు తెలుసుకున్న తలసాని

**- పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్న శ్రీనివాస్ యాదవ్**



మంచిరేవులలో ఉన్న తన పెద్దమ్మను ఆప్యాంగా పలుకరించి యోగక్షేమాలను తెలుసుకుంటున్న మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్.

**నార్సింగి, జూన్ 17 ప్రభాతవార్త :** రాకపోకలుంటేనే రక్తసంబంధాలు, బంధుత్వాలు బలపడుతాయని, పది కాలాల పాటు నిలబడుతాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ అసెంబ్లీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. బుధవారం శ్రీనివాస్ యాదవ్ గండిపేట మండలం మంచిరేవుల గ్రామంలో ఉంటున్న తన పెద్దమ్మ మేకల నాగమణి ఇంటికి వచ్చారు. ముందుగా ఆమె ఆశీర్వాదం తీసుకున్నారు. పక్కనే కూర్చొని, చేతిలో చేయి వేసి ఆప్యాయంగా పలుకరించారు. పెద్దమ్మ ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఆమె యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ తను పాఠశాలకు వెళ్లే సమయంలో వేసవి సెలవులు వస్తే మంచిరేవులకు వచ్చేవాడినని, పెద్దమ్మ చేసిన వెన్నముద్దలు ఇష్టంగా తినే వాడినని, ఆమె పంచిన ప్రేమ అమోఘమన్నారు. సరదాగా మంచిరేవులలోని మూసీ వాగులో ఈత పడే వారమని, ఎప్పుడు వేసవి సెలవులు వచ్చినా ఇక్కడికే వచ్చే వాడినని ఆ పాత మధురమైన జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. మంచిరేవులలోని తన సోదరులు సత్యనారాయణ యాదవ్, వీరయ్య యాదవ్, కృష్ణ యాదవ్, శ్రీనివాస్ యాదవ్‌లు వారి కుటుంబ సభ్యులతో పాటు చిన్ననాటి స్నేహితులతో సరదాగా గడిపారు. ఈ కార్యక్రమంలో మంచిరేవుల మాజీ సర్పంచ్ మేకల ప్రవీణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులపై నార్సింగి డిసితో సమావేశమైన కాంగ్రెస్ నేతలు



నార్సింగి సర్కిల్ డిసి లక్ష్మారెడ్డితో అభివృద్ధి పనులపై చర్చిస్తున్న కాంగ్రెస్ సీనియర్ నాయకులు మల్లేష్ ముదిరాజ్, రామకృష్ణారెడ్డి తదితరులు.

**నార్సింగి, జూన్ 17 ప్రభాతవార్త :** అభివృద్ధి పనులపై నార్సింగి డిసి లక్ష్మారెడ్డితో కాంగ్రెస్ నాయకులు చర్చించారు. గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్ ముదిరాజ్, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ వేణుగౌడ్, మణికొండ మాజీ ఫ్లోర్ లీడర్ కొండకళ్ల రామకృష్ణారెడ్డిలు బుధవారం నార్సింగిలోని సర్కిల్ కార్యాలయంకు వెళ్లి డిసిని కలిసి కొనసాగుతున్న అభివృద్ధి పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని కోరారు. అలాగే వర్షాకాలంలో వరదల ముప్పు ఉన్న ప్రాంతాలలో పర్యటించాలని కోరారు. చిన్నపాటి వర్షానికే మణికొండలోని పంచవటి కాలనీ, నార్సింగిలోని బాలాజీ, భవానీ నగర్, నెక్నాంపూర్‌లోని లోతట్టు ప్రాంతాలు వరద నీటితో నిండిపోయి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నాయని తెలిపారు. వరద నీరు సులువుగా దిగువకు వెళ్లేలా నాలా పూడికలను తీయించాలని, మ్యాన్‌హోల్స్‌లో తట్టుకుంటున్న చెత్తను ఎప్పటకప్పుడు తొలగించాలని కోరారు. పాడైపోయిన రోడ్లకు వెంటనే మరమత్తులు చేయించాలని, మంచినీటి సరఫరాను పెంచేలా కృషి చేయాలని డిసిని కోరినట్లు నాయకులు తెలిపారు. ఇందుకు డిసి లక్ష్మారెడ్డి సానుకూలంగా స్పందించారని, ప్రజల సహకారంతో అన్ని రకాల సమస్యలు పరిష్కరిస్తామని హామీనిచ్చారని కాంగ్రెస్ నాయకులు వివరించారు.

## వరదల ముప్పుపై సిబ్బందికి అవగాహన



**నార్సింగి, జూన్ 17 ప్రభాతవార్త :** వర్షాల వలన వచ్చే వరదల కారణంగా ఎదురయ్యే ముప్పును ఎలా ఎదుర్కోవాలో నార్సింగి సర్కిల్ అధికారుల బృందం, సిబ్బందికి బుధవారం డిసి లక్ష్మారెడ్డి అవగాహన కల్పించారు. సైబరాబాద్ కమీషనర్ సృజన ఆదేశాల మేరకు మణికొండ క్రిమ్స్ విల్లాస్ వద్ద సిబ్బందికి వరదలపై అనుసరించాల్సిన అంశాలను డిసి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ముగిసేంత వరకు అన్ని శాఖల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. వరదల కారణంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా విధులు నిర్వహించాలని సూచించారు. పారిశుధ్యం, ఇంజనీరింగ్, ట్రాఫిక్, ఎమర్జెనీ విభాగాలు అన్ని శాఖల అధికారులు సమిష్టిగా పని చేయాలని, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఇ శివసాయి, ఏఈలు శివప్రసాద్, సంతోష్, శ్రీనేష్, శానిటేషన్ సూపర్‌వైజర్లు లచ్చిరాం, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

### ఇన్‌స్టా పరిచయం.. యువతికి సైబర్ వేధింపులు

**జూబ్లీహిల్స్, జూన్ 17, ప్రభాతవార్తః**

సోషల్ మీడియా ద్వారా పరిచయమైన ఒక యువతిని బెదిరిస్తూ, సైబర్ వేధింపులకు పాల్పడిన యువకుడిపై బంజారాహిల్స్ ఠాణాలో కేసు నమోదైంది. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. వహీద్ అనే వ్యక్తి 2024 డిసెంబర్‌లో ఇన్‌స్టాగ్రామ్ ద్వారా యువతి(19)తో పరిచయం పెంచుకుని, 2025 అక్టోబర్ వరకు సన్నిహితంగా మెలిగాడు. అనంతరం ఆమె ఫొటోలను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తానంటూ బెదిరిస్తూ బ్లాక్‌మెయిల్ చేయడం ప్రారంభించాడు. బాధితురాలి తల్లి జీమెయిల్ ఖాతాను హ్యాక్ చేసి, యువతి పేరుతో నకిలీ సోషల్ మీడియా ఖాతాలు సృష్టించాడు. వివిధ మొబైల్ నంబర్ల నుంచి ఫోన్ కాల్స్ చేస్తూ యువతిని వేధించడంతోపాటు ఆమె స్నేహితులను సంప్రదించి బెదిరించాడు. నిరంతరం వెంటపడటం, ఆన్‌లైన్ వేధింపులు, బెదిరింపుల కారణంగా తన భద్రత, పరువుకు ముప్పు ఏర్పడిందని బాధితురాలు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### జూబ్లీహిల్స్‌లో వైద్యుడిని బెదిరించి డబ్బు వసూలు

**జూబ్లీహిల్స్, జూన్ 17, ప్రభాతవార్తః**

తెలంగాణ ముఖ్యమంత్రికి అత్యంత సన్నిహితుడైన డాక్టర్ సింగిరెడ్డి రోహిణ్‌రెడ్డి సోదరుడిని బెదిరించి డబ్బు వసూలుకు పాల్పడిన అయిదుగురిపై జూబ్లీహిల్స్ ఠాణాలో కేసు నమోదైంది. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. డాక్టర్ సి. సాయి సుధీర్ రెడ్డి భాస్కర్ మెడికల్ కాలేజీలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా, అపోలో క్రేడిల్ ఆసుపత్రిలో కన్సల్టెంట్ వైద్యుడిగా పనిచేస్తున్నారు. పి. రాజేంద్ర కుమార్ జైన్, ఆయన కుటుంబ సభ్యులు జూబ్లీహిల్స్‌లోని ఓ ఆస్తి విషయంలో వైద్యుడికి ఎలాంటి సంబంధం లేకపోయినా తప్పుడు ఆరోపణలు చేస్తూ వేధింపులకు పాల్పడుతున్నారు. వైద్యుడి ప్రతిష్ఠను దెబ్బతీసేలా ప్రచారం చేయడంతో పాటు ప్రాణహాని తలపెడుతామంటూ బెదిరింపులకు పాల్పడ్డారు. భయభ్రాంతులకు గురిచేసి వైద్యుడి వద్ద నుంచి రూ.5 లక్షలు వసూలు చేశారు. దీంతో వైద్యుడు జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయ డంతో పోలీసులు రాజేంద్రకుమార్ జైన్, ఉమారాణి జైన్, జితేందర్ జైన్, దివ్య తదితరులపై బీఎన్ఎస్ సెక్షన్లు 308 (5), 351(3) రెడ్ విత్ 3(5) కింద కేసు నమోదు చేసి దర్యా ప్తు చేస్తున్నారు.

### ముగ్గు వేస్తున్న మహిళతో అగంతకుడి అసభ్యప్రవర్తన

**జూబ్లీహిల్స్, జూన్ 17, ప్రభాతవార్తః**

ఇంటి ముందు ముగ్గు వేస్తున్న ఒక మహిళతో ఒక వాహనదారుడు అసభ్యంగా ప్రవర్తించిన సంఘటన జూబ్లీహిల్స్ ఠాణా పరిధిలో చోటుచేసుకొంది. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. జూబ్లీహిల్స్‌లో నివసించే బీజేపీ నేత గూడురు నారాయణరెడ్డి ఇంట్లో పనిచేస్తున్న ఒక మహిళ ఇంటి ముందు ముగ్గు వేస్తుండగా పల్సర్ బైక్‌పై వచ్చిన ఓ వ్యక్తి వెనుక నుంచి వచ్చి అసభ్యంగా తాకి తోసివేసి పరారయ్యాడు. బాధితురాలు అతడిని పట్టుకునే ప్రయత్నం చేసినప్పటికీ తప్పించుకున్నాడు. నిందితుడు నీలిరంగు చొక్కా ధరించి ఉన్నట్లు తెలిపింది. ఇంటి బయట ఉన్న సీసీటీవీ కెమెరాల్లో ఘటన రికార్డయ్యింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు జూబ్లీ హిల్స్ పోలీసులు బీఎన్ఎస్ సెక్షన్లు 74, 79, 296 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడిని గుర్తించేందుకు సీసీ కెమెరాలు పరిశీలించారు.

